క్లుప్తంగా

అందుబాటులోకి కబడ్డీ, వాలీబాల్ కోర్టులు



క్రీడా మైదానాలను ప్రారంభిస్తున్న స్కూల్ కమిటీ చైర్మన్ జోగినాయుడు

మునగపాక: పాటిపల్లి మోడల్ స్కూల్‌లో గురువారం టి.సిరసపల్లికి చెందిన గ్రామీణ వికాస్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో తీర్చిదిద్దిన కబడ్డీ, వాలీబాల్ కోర్టులను గురువారం స్కూల్ కమిటీ చైర్మన్ జోగినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అరుణ, పెద్దలు ఆడారి గోవింద, ఆడారి భాస్కరరావు, కొయిలాడ పరశురామ్, కొయిలాడ జగదీష్, పల్లా సన్యాసిరావు, పాలిశెట్టి జగదీష్, గొల్లవిల్లి త్రిమూర్తులు, ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిండి వంటల తయారీపై శిక్షణ



పిండి వంటలు తయారు చేస్తున్న విద్యార్థులతో అధ్యాపకులు

పాయకరావుపేట: స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు విద్యార్థులకు సంప్రదాయ పిండి వంటల తయారీపై శిక్షణ ఇచ్చారు. పెరుమాళ్ళపురం పాకం గారెలు, కాకినాడ గొట్టం కాజా, ఆత్రేయపురం పూతరేకులు, మాడుగుల హల్వా, బందరు లడ్డూ, హల్వా తయారీలో మెలకువలను ఏషియన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ వై.రాజేష్ వివరించారు. విద్యా సంస్థల అధినేత నరసింహారావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డి.రూప స్వర్ణకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



జెడ్పీ సీఈవో నారాయణమూర్తిని సత్కరిస్తున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి సందర్శించారు. సీఈవోగా బాధ్యతలు చేపట్టాక మొట్టమొదటిసారిగా మునగపాక రావడంతో అతనిని ఎంపీడీవో ఎం.ఉషారాణి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రసాద్, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, ఉపాధి హామీ పథకం ఏపీవో శివ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

18న శూలాల మహోత్సవం

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఈ నెల 18న జరగనున్న శూలాల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఈ మేరకు పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. కార్తీక మాసం మూడో సోమవారం ఏటా ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు,పెద్దలు దొడ్డి శ్రీనివాసరావు, రాజునాయుడు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మునగపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి కోరారు. మునగపాకలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విమలగిరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, పెద్దలు దాడి ముసిలినాయుడు, కర్రి సాయికృష్ణ, కేపీ రావు, టెక్కలి పరశురామ్, వేగి దేవతనాయుడు, సీహెచ్‌వో దేవకాంత, ఏఎన్‌ఎం దేవకి పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



బోదిగల్లం పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



గొడిచర్లలో ప్రత్యేక అవసరాల పిల్లలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు



పాయకరావుపేట గ్రంథాలయంలో మాట్లాడుతున్న విశ్రాంత అధ్యాపకులు



గవర్ల అనకాపల్లిలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠకులు



ఒంపోలు ప్రాథమిక పాఠశాలలో..



పెదగుమ్ములూరు పాఠశాలలో నెహ్రూ వేషధారణలో ఓ విద్యార్థి



యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డు హైస్కూల్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ



పెదరాంభద్రపురం పాఠశాలలో డ్యాన్స్ వేస్తున్న విద్యార్థులు



రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నక్కపల్లి: దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టిన రోజును పురస్కరించుకొని యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నక్కపల్లి, పెదబోదిగల్లం, వేంపాడు, ఉద్దండపురం, గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు ఆటలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాణిలలిత, సుగుణ, సలీమా, సత్యనారాయణ, మూర్తిరాజు, అప్పారావు, ఉపాధ్యాయులు ఆచార్యులు, చిన్నారావు, శ్రీదేవి, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో గురువారం జరిగిన బాలల దినోత్సవానికి స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలల హక్కులపై న్యాయమూర్తి అవగాహన కల్పించారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. భవిత కేంద్రం నిర్వహణకు పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్ పద్మావతి రూ.10 వేల నగదును అందజేశారు. పట్టణం, మండలంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ స్కూళ్లలో నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు బి.హరిశంకర్రావు, పీవీ రమణ, డి.వెంకట్రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌ఎస్‌ఎల్‌డీ భవానీ, ఎంఈవో–2 అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు వి.నాగేశ్వర్రావు, కె.శ్రీనివాస్, కొణతాల విశ్వేశ్వర్రావు, పద్మావతి, భవానీ,జి శాంతకామేశ్వరి, భవిత కేంద్రం బోధకులు మూర్తి, అనురాధ పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ప్రారంభం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం పలువురు విశ్రాంత అధ్యాపకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్స్‌కు విభజిత ఆంధ్రప్రదేశ్, జూనియర్స్‌కు ఉమ్మడి విశాఖ జిల్లా విశిష్టతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు ఆర్.వి.రత్న మాస్టార్, తేజమత వెంకటేశ్వరరావు, అచ్యుత, ఎస్.సీతారామయ్య, వివిధ కళాశాలల అధ్యాపకులు, చిట్టిబాబు, 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పెదరాంభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. చాచా నెహ్రూ గొప్పతనాన్ని, దేశానికి ఆయన సేవలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నెహ్రూ ఆశయ సాధనకు పాటుపడాలి

మునగపాక: బాలల దినోత్సవం సందర్భంగా ఒంపోలు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పలు ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి బహుమతులు అందజేశారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. సర్పంచ్ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, తాతారావు, మాజీ వైస్ ఎంపీపీ ఉల్లింగల గోవింద, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మునగపాక: ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వేణుగోపాలరావు కోరారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం మునగపాకలోని శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పెంటకోట తులసీరావు, మాజీ గ్రంథాలయాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గవర్ల అనకాపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నెహ్రూ చిత్రపటానికి పలువురు పాఠకులు నివాళులర్పించారు. గణపర్తి శాఖా గ్రంథాలయంలో జరిగిన వేడుకల్లో గ్రంథాలయాధికారి అప్పలనరసమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు.

ఎస్.రాయవరం: బాలల దినోత్సవం సందర్భంగా ధర్మవరం అగ్రహారం, పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలల్లో నేతాజీ, నెహ్రూ, భారతమాత వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ, సుధాకర్, ఉపాధ్యాయులు గారా ప్రకాష్, కుసుమకుమారి, దీపిక, అనిత, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో పాములవాక కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్, రాజుపేట ఎంపీయూపీ స్కూల్, కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్స్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాములవాకలో హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, రాజుపేటలో హెచ్‌ఎం నానిమణిమోహన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



చినదొడ్డిగల్లులో నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



దిమిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న పాఠకులు



కోటవురట్ల శాఖా గ్రంథాలయం వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు



యలమంచిలి శాఖా గ్రంథాలయంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

- వాడవాడలా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

నక్కపల్లి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు వాడవాడలా గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నక్కపల్లి, చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయాధికారులు గోవిందేశ్వరరావు, జనార్దన్‌లు పతాకావిష్కరణ చేశారు. ముందుగా తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా విరాజిల్లుతున్నాయన్నారు. చినదొడ్డిగల్లులో జెడ్పీ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సెల్‌ఫోన్ వద్దు, పుస్తకం ముందు అంటూ నినాదాలు చేశారు. గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజేస్తూ వారం రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నామని లైబ్రేరియన్‌లు గోవిందేశ్వరరావు, జనార్దన్ తెలిపారు.

రాంబిల్లి(యలమంచిలి): మండలంలో దిమిలి శాఖా గ్రంథాలయంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు జాతీయ పతాకావిష్కరణ చేసి, భారతమాతకు వందనం చేశారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిమిలి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం జి.ప్రసాద్, గ్రంథాలయాధికారి శకుంతల, విశ్రాంత ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పోలిపల్లి, పంచాయతీ కార్యదర్శి శైలజారాణి, అచ్యుత విద్యా సంస్థల అధిపతి శేషగిరి మాట్లాడుతూ నెహ్రూ జీవిత చరిత్రను చిన్నారులను వివరించారు. చిన్నారులకు మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి బాలల దినోత్సవం నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతీదేవి చిత్ర పటానికి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు నెహ్రూ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీ నిర్వహించారు.

యలమంచిలి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం నెహ్రూ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి పలువురు విశ్రాంత ఉద్యోగులు, అధ్యాపకులు, సీనియర్ సిటిజన్లు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ అధికారి ఆనంద్, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులు పీఎస్ జగ్గారావు, వెంకట్రావు, విశ్రాంత అధ్యాపకుడు ఆడారి పూరీ జగన్నాథం, సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు డీ–పట్టాలు మంజూరు చేయాలి

పాయకరావుపేట: మండలంలోని కుమారపురం గ్రామంలో నిరుపేదలకు డీఫారం పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు డిమాండ్ చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమారపురం రెవెన్యూలో ప్రభుత్వ బంజరు భూమి సర్వే నెంబర్ 318/2లోని 25 ఎకరాల్లో జీడి, మామిడి తోటలు పెంచుకుని జీవనోపాధి పొందుతున్న గ్రామానికి చెందిన 30 మంది నిరుపేదలకు డీ పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు బందుల సుబ్బలక్ష్మి మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తున్న పేదలకు న్యాయం చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎరిపిల్లి రమణమ్మ, వరలక్ష్మి, చినతల్లి, సత్యవతి, పాల సత్తిబాబురెడ్డి, కె.చినబాబు, డి.రామచంద్రరెడ్డి, కుమారపురం గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించిన కూటమి ప్రభుత్వం

మునగపాక: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం నేతలు అల్ల మహేశ్వరరావు, శ్రీనివాసరావు విమర్శించారు. సీపీఎం ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం డీటీ శేషుబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలు పెంచడంతో పాటు విద్యుత్ చార్జీలను పెంచేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు చేయడం విచారకరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామాన్య ప్రజల జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు.

అచ్యుతాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం నిర్వహిస్తున్న ప్రజా పోరులో భాగంగా తిమ్మరాజుపేట, హరిపాలెం, చోడపల్లి, పూడిమడక సచివాలయాల వద్ద సీపీఎం శ్రేణులు గురువారం నిరసన తెలిపాయి. ఆయా నిరసన కార్యక్రమాల వద్ద కర్రి అప్పారావు, సోమునాయుడు, చేపల తాతయ్యలు మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరిగిపోయాయని, ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఒకటి చెబితే ఇప్పుడు ఇంకొక్కటి జరుగుతుందని తెలిపారు.

నక్కపల్లి: ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలంటూ నక్కపల్లిలో స్థానిక సీపీఎం కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో నాయకులు డిప్యూటీ తహసీల్దార్ అన్నాజీరావుకు వినతిపత్రం అందజేశారు.

రాంబిల్లి(యలమంచిలి): నిత్యవసర ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాంబిల్లి మండల కార్యదర్శి జి.దేముడునాయుడు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా గురువారం రాంబిల్లి మండలం జెడ్.చింతువా పంచాయతీలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిత్యావసర సరకుల ధరలను అమాంతం పెంచిందన్నారు. అనంతరం ప్రజా సమస్యలపై జెడ్.చింతువా పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి



మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ ఏఈ వినయ్‌కుమార్

మునగపాక: త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నీటి పారుదల శాఖ ఏఈ వినయ్‌కుమార్ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన గురువారం ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులతో సమావేశం నిర్వహించారు. సాగునీటి సంఘాల ఎన్నికలు పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల విధులను ప్రతి ఒక్కరూ సక్రమంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. డీటీ శేషుబాబుతో పాటు పలువురు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

చినతీనార్లలో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం



ఆర్‌వో ప్లాంట్ ప్రారంభిస్తున్న కంపెనీ జీఎంలు

నక్కపల్లి: చిన తీనార్ల మత్స్యకార గ్రామంలో హెటిరో కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను కంపెనీ జీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి, రాజారెడ్డి గురువారం ప్రారంభించారు. సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని ప్రతినిధులు తెలిపారు. మత్స్యకారులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు కంపెనీ సీఎండీ డాక్టర్ బి.పార్థసారథిరెడ్డి ఆర్‌వోప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. పాఠశాలల్లో కూడా ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో అధునాతన డిజిటల్ ఎక్స్‌రే ప్లాంట్, స్కానింగ్ మెషీన్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎరిపల్లి ముసలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుమ్మడి అమ్మలు పేరంటాలు జాతర ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో పేరంటాలు అమ్మవారు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామంలో గుమ్మడి అమ్మలు పేరంటాలు అమ్మవారి జాతర గురువారం సాయంత్రం వైభవంగా ప్రారంభమైంది. ముందుగా యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆలయం వద్ద ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యుత్ దీపాలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శుక్రవారం అమ్మవారి ప్రధాన జాతర జరగనుందని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు కుమారపురంలో రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని కుమారపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

108 ఉద్యోగుల నిరసన



నిరశన తెలుపుతున్న 108 అంబులెన్స్ ఉద్యోగులు

యలమంచిలి రూరల్: ఆపదలో పలువురిని ఆదుకుంటున్న 108 అంబులెన్సుల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా నిర్వహించడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో 108 వాహనం ఉద్యోగులు గురువారం యలమంచిలిలో నిరసన తెలిపారు. గురువారం విజయవాడలో ఈ మేరకు సమ్మె నోటీసును ప్రభుత్వానికి అందజేసినట్టు ఉద్యోగులు పేర్కొన్నారు. దీనికి సంఘీభావం తెలుపుతూ యలమంచిలిలో 108 వాహనం ఉద్యోగులు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. 108 వాహనాల నిర్వహణ బాధ్యతను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని, వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు పెంచాలని కోరారు. సమస్యల పరిష్కారానికి దశల వారీగా ఆందోళన చేపడతామని వారు స్పష్టం చేశారు.

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు 108 కేంద్రం వద్ద సిబ్బంది గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెకు దిగుతామని చెప్పారు. ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్లు, అరియర్స్, ఈఎల్స్ డబ్బులు చెల్లించాలన్నారు. ప్రభుత్వమే నేరుగా 108 సర్వీసులను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పైలెట్లు డి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, టి.రాజేష్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: స్థానిక విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ మరమ్మతు, నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్) రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రవరం, కొత్త ఎర్రవరం, లైను కొత్తూరు, సోమన్నపాలెం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

అభిజిత్ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

అచ్యుతాపురం: అభిజిత్ పరిశ్రమ కార్మికుల సమస్యలపై డెవలెప్‌మెంట్ కమిషనర్(లేబర్) ఆధ్వర్యంలో గురువారం యాజమాన్యం, కార్మికులు, కాంట్రాక్టర్లతో చర్చలు నిర్వహించారు. బకాయిలు చెల్లించి, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు కోరారు. సీఐటీయూ నాయకుడు ఆర్.రాము, ప్రతినిధులు పాల్గొన్నారు

మధుమేహంపై అప్రమత్తం

యలమంచిలి రూరల్: చాపకింద నీరులా విస్తరిస్తున్న మధుమేహ వ్యాధి పట్ల అన్ని వయస్సుల వారు అప్రమత్తంగా ఉండాలని యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. గురువారం కళాశాల జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా వ్యాధి నియంత్రణ కోల్పోయి ఆరోగ్య సమస్యలు విపరీతమవుతాయన్నారు. కార్యక్రమానికి వర్చువల్‌గా హాజరైన శ్రీకాకుళం జిల్లా దండు గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.సుధీర్ మాట్లాడుతూ డయాబెటీస్ లక్షణాలు, రావడానికి కారణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రేఖా రామారావు, జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆడారి అర్జున అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత ప్రభుత్వాస్పత్రి భవనం వినియోగించాలి

యలమంచిలి రూరల్: కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన యలమంచిలి పాత సామాజిక ఆస్పత్రి భవనాలను నిరుపయోగంగా వదిలిపెట్టడం దురదృష్టకరమని సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సామాజిక ఆస్పత్రిని పట్టణంలోని తులసీనగర్‌లో కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యాక అక్కడకు మార్చారని, ఆ తర్వాత పట్టణంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న పాత ఆస్పత్రి భవనాన్ని పూర్తిగా గాలికొదిలేశారన్నారు. దీంతో ఆ భవనం క్రమంగా శిథిల స్థితికి చేరుకుంటోందన్నారు. ఈ భవనాన్ని వృథాగా ఉంచకుండా వినియోగంలోకి తేవాలని ఆయన కోరారు.

వ్యాధులపై గ్రామాల్లో సర్వే

పాయకరావుపేట: మండలంలోని నామవరం, పీఎల్‌పురం గ్రామాల్లో క్యాన్సర్, బీపీ, షుగర్ వ్యాధులపై సర్వే నిర్వహించినట్టు ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. అదే విధంగా వ్యాధుల పట్ల అవగాహన కూడా కల్పించామన్నారు. ప్రతి ఇంటికి ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది వెళ్లి జియో ట్యాగింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలు ఎన్నికలకు సిద్ధం కావాలి

పాయకరావుపేట: త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని నీటి పారుదల శాఖ ఏఈ కె.శ్రీరామమూర్తి సూచించారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలకు సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలో రైతులతో ఓటింగ్ చేయించుకునే విధానం, ఆయా సాగునీటి చానల్స్ పరిధిలో ఓటర్ల వివరాలపై అవగాహన కల్పించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెట్‌లో విజయ్‌కుమార్ ప్రతిభ

అచ్యుతాపురం: టెట్–2024లో మంచి మార్కులు సాధించిన కొండకర్లకు చెందిన అభ్యర్థి గుబ్బల విజయ్‌కుమార్‌ను యూటీఎఫ్ ఉపాధ్యాయులు గురువారం సత్కరించారు. విజయ్‌కుమార్‌కు టెట్‌లో 150 మార్కులకు 145 మార్కులు రావడం అభినందనీయమని యూటీఎఫ్ అధ్యక్షుడు నానాజీ అన్నారు. ప్రకాశ్, వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.